క్లుప్తంగా

జిల్లా రచయితకు డాక్టరేట్ ప్రదానం



దాసరి వెంకటరమణ

కర్నూలు కల్చరల్: జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత దాసరి వెంకట రమణకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అలనాటి బాలల ప్రతిక చందమామ కథలపై ఉస్మానియా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పేర్కొన్నారు. 2014లో ఈయనకు బాల సాహిత్య విభాగంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రదానం చేశారు. బాలల కథలతో మూడు సంకలనాలు ప్రచురించారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల కథా సమయం రచయితలు వెంకటకృష్ణ, ఇనాయతుల్లా, మారుతి, ఎ.వి.రెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబులు హర్షం వ్యక్తం చేశారు.

10 నుంచి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేవైఎమ్ నాయకులు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎమ్) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 10 నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు బీజేవైఎమ్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ ఆదిశేషు వెల్లడించారు. శనివారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఫిబ్రవరి 10 నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు మొదటి సారి జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్ ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గలవారు పోటీల్లో పాల్గొన వచ్చని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో బీజేవైఎమ్ జిల్లా అధ్యక్షుడు తలారి సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, నాయకులు శివ, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపుపై దృష్టి సారించాం

కర్నూలు(సెంట్రల్): రిజిస్ట్రేషన్స్ శాఖకు కేటాయించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ..జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్టాంపుల కొరత లేదన్నారు. కార్యాలయాలకు వచ్చే విక్రయ దారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతానికి లక్ష్యం మేరకు ఆదాయం సమకూరేందుకు అనువైన పరిస్థితులు ఉన్నాయని, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్య ఎక్కువగా ఉంటుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

హోరాహోరీగా ఫెన్సింగ్ పోటీలు



ఫెన్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న 66వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. రాష్ట్ర స్థాయి పోటీల్లో కర్నూలు జట్టుకు చెందిన క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచాయి. విజేతల వివరాలను స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ రంగారెడ్డి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య ప్రకటించారు. అండర్ -17 విభాగం బాలుర విభాగంలో కర్నూలు జట్టు (ప్రథమ స్థానం) తూర్పు గోదావరి జిల్లా జట్టు (ద్వితీయ స్థానం), విజయనగరం జట్టు (మూడవ స్థానం), వైఎస్సార్ జట్టు (నాలుగవ స్థానం), అండర్-17 బాలికల విభాగంలో కర్నూలు (ప్రథమస్థానం), అనంతపురం (ద్వితీయ స్థానం), విజయనగరం జట్టు (తృతీయ స్థానం) సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమా ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు, హంట్
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, మాలికాప్పురం, వారసుడు, హంట్, సింధూరం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య, మాలికాప్పురం, హంట్
ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, గాంధీ గాడ్సే ఏక్ యుద్ద్, వాలంటీన్స్ నైట్
భరత్ కాంప్లెక్స్ : పఠాన్, ధమాకా
రాజ్ : వీర సింహారెడ్డి
శ్రీరామ : వాల్తేరు వీరయ్య
విజయ : పఠాన్

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి

- అన్యాక్రాంతమైన స్థలాలను గుర్తించి తిరిగి స్వాధీన పరచుకోవాలి
- ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్



వక్ఫ్‌బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కర్నూలు ఎమ్మెల్యే, బోర్డు రాష్ట్ర డైరెక్టర్ ఎంఎ హఫీజ్ ఖాన్ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని తన కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు అధికారులు, ముతవల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, అందుకు తగ్గట్లు అందరూ పనిచేయాలని సూచించారు. మసీదు, దర్గాలు, పీర్ల చావిడీల స్థలాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ప్రతి సెంటు లెక్కలను డిజిలైజ్ చేయాలని చెప్పారు. ఒక్కో మసీదు / సంస్థకు ఉన్న ఆస్తులు, రికార్డులు భద్రపర్చాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే అన్యాక్రాంతం అయిన భూములను గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ విషయంలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. భూములు, స్థలాలను కాపాడడంలో ముతవల్లులు కీలక పాత్ర పోషించాలని, ఎక్కడ గజం జాగా ఆక్రమణకు గురవుతున్నట్లు తెలిసిన వెంటనే వక్ఫ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. ఏదైన సమస్యలు తలెత్తితే నేరుగా తమను కలిసి చెప్పుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి మహబూబ్ బాషా, నాయవాది సలావుద్దీన్, కర్నూలు మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు నయీంపాషా, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు మౌలానా మంజూర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నూరుల్లా ఖాద్రీ, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ దాదాబాషా సాహెబ్, డైరెక్టర్ ఫిరోజ్, అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన ముతవల్లులు

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



రగ్బీ విజేతలకు ట్రోఫీ, మెడల్స్ బహూకరించిన సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి

కర్నూలు (టౌన్): కర్నూలు నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ పాఠశాలల రగ్బీ చాంపియన్‌ష్ పోటీలు శనివారం సాయంత్రం ముగిసాయి. విజేతలుగా ఆదర్శ విద్యా మందిర్ (బాలుర జట్టు), పాణ్యం ఎస్‌టీ ఆశ్రమ పాఠశాల (బాలికల జట్టు) నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ విద్యా సంస్థల సొసైటీ సమన్వయకర్త డాక్టర్ శ్రీదేవి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గెలుపోటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంధి అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అండర్-17 బాలుర విభాగంలో ఆదర్శ విద్యా మందిర్, బాలికల విభా గంలో ఎస్‌టీ ఆశ్రమ పాఠశాల పాణ్యం జట్టు మొద టి స్థానం సంపాదించి ట్రోఫీతో పాటు పతకాలు కైవసం చేసుకున్నారు. అండర్ 11 బాలుర విభాగంలో ఆదర్శ విద్యా మందిర్, సి.బెళగల్ జట్లు వరుస గా మొదటి, రెండు స్థానాలు కైవసం చేసుకున్నా యి. బాలికల విభాగంలో కేజీబీవీ ఓర్వకల్లు, ఏపీ డబ్ల్యూఆర్ దిన్నెదేవరపాడు పాఠశాల విద్యార్థినులు మొదటి, రెండు స్థానాల్లో గెలుపొందారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శి రామాంజనేయు లు, వ్యాయమా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారులోని ఏపీ కార్బైట్స్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న 220కేవీ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులు పనులు చేపడుతున్న కారణంగా గాయత్రి ఎస్టేట్, బిర్లాగడ్డ, ఠాగూర్ నగర్, లక్ష్మీ నగర్, మద్దూరు నగర్, బీ.క్యాంప్, సీ. క్యాంప్, గణేష్ నగర్, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, సాయి వైభవ్ నగర్, నంద్యాల చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రీ నగర్, పోస్టల్ కాలనీ, మారుతి మెగా సిటీ, బృందావన్ నగర్, మారుతి నగర్, అరుంధతి నగర్, టెలికాం నగర్, గఫూర్ నగర్, పార్థసారథి నగర్, కమలా నగర్, రామచంద్ర నగర్, రామకృష్ణ నగర్, గుత్తి రోడ్డు, షరీన్ నగర్, అబ్బాస్ నగర్, కృష్ణ నగర్, మిలటరీ కాలనీ, గార్గేయపురం, దిగువపాడు, శివరాంపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు.

హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష

- ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో వక్తలు



జ్యోతి ప్రజ్వలనతో ధార్మిక సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న మఠాధిపతులు

కర్నూలు కల్చరల్: హైందవ చైతన్యమే జగతికి శ్రీరామ రక్ష అని బళ్లారి ఉమామహేశ్వర పీఠం పీఠాధిపతి శ్రీ నిత్యానంద భారతి స్వామి అన్నారు. ఓల్డ్ సిటీలోని లలితా పీఠంలో శనివారం జరిగిన ధార్మిక సంస్థల ఆత్మీయ సమ్మేళనంలో పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు, వక్తలు పాల్గొని ప్రసంగించారు. వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమ్మేళనంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఎనిదోతరం వారసులు వీరంభట్లయ్య, తెలుగు భాషా వికాస ఉద్యమం కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, నాగలింగేశ్వర జీవైక్య మఠం మఠాధిపతి ఎల్లప్ప స్వామి, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. ఉగాది పర్వదినాన్ని శోభాయమానంగా జరుపుకోవడం, హిందూ కాలమానిని అనుసరించాలన్నారు. పాశ్చాత్య పోకడలు వీడి సంప్రదాయ బద్ధంగా పర్వదినాలను జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు హిందూ ధర్మం పట్ల ఆసక్తిని ఆపేక్షను మాత్రమే కాక అవగాహనను కలిగి ఉండాలన్నారు. ప్రతి మాతృమూర్తి సనాతన ధర్మాన్ని నేర్పాలన్నారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక దాస్, ఆవోపా జిల్లా అధ్యక్షులు యుగంధర్ శెట్టి, హనుమాన్ దీక్ష గురువు రామాంజనేయులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు నీలిమ, నాగరాజశర్మ, రామచంద్రారెడ్డి, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎఫ్ఆర్ఎస్ నుంచి కార్మికులకు మినహాయింపు ఇవ్వండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఏపీఎఫ్ఆర్ఎస్ (ఆంధ్రప్రదేశ్ ఫెషియల్ రికగ్నేషన్ సిస్టమ్) నుంచి మినహాయింపు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట మున్సిపల్ కార్మికులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్‌పై అవగాహన లేని మున్సిపల్ కార్మికులు ఏవిధంగా అటెండెన్స్ వేస్తారని ప్రశ్నించారు. గత ఏడాది సమ్మెకాలంలో ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లను అమలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి, మేనేజర్ చిన్నరాముడులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ పెంచి మంచి చేశారు

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో మహిళ లక్ష్మమ్మ
- వన్‌టౌన్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పింఛన్ పెంచి చాలా మంచి చేశారని, మాలాంటి బీదలకు మేలు చేస్తున్న ఆయన ఎప్పుడూ చల్లగా ఉండాలని ఎమ్మెల్యే ఎంఏ హఫీజ్‌ఖాన్ ముందు సంతోషాన్ని వ్యక్తం చేసింది వన్‌టౌన్‌కు చెందిన లక్ష్మమ్మ. శనివారం ఎమ్మెల్యే 7వ వార్డులో వివిధ శాఖల అధికారుల కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మేదరిగేరి, వన్‌టౌన్ ఏరియాల్లోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరిస్తూ వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రభుత్వం మూడేళ్లలో మంజూరు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలియజేసి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఒకరు చనిపోతేనే మరొకరికి పింఛన్ మంజూరు అయ్యే పరిస్థితి ఉండేదని అన్నారు. కానీ జగనన్న సీఎం అయ్యాక అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు అవుతోందనే విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో సంక్షేమ పథకాలు అందాలంటే ఎన్నో నిబంధనలు ఉండేవని, ముఖ్యంగా జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులకు ముడుపులు ఇవ్వడంతో పాటు వారి దయాదాక్షిణ్యాలపై ఆధాపడి ఉండేవన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా పథకాలు అందజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జుబేర్ అహ్మద్, నాయకులు నవీద్, పర్వేజ్, షోయబ్, అన్వర్, నజీర్, ఖలీల్, లతీఫ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథసప్తమి వేడుకలు





సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీకి స్వాగతం పలుకుతున్న చిన్నారులు , ఇండస్ పాఠశాలలో సూర్య నమస్కారాలు చేస్తున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానములు, ఇండస్, మాంటెస్సోరి పాఠశాలల సంయుక్త నిర్వహణలో పాఠశాల ప్రాంగణంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడ అష్టాక్షరీ మహామంత్ర పీఠం పీఠాధిపతులు శ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామీజీ విద్యార్థులకు అనుగ్రహ భాషణం చేశారు. దేశాన్ని విశ్వగురువుగా ప్రతిష్టించుటకు విద్యార్థులు సంకల్పబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులచే ప్రదర్శించిన స్వాగత నృత్యం, సూర్య నమస్కారాలు, ప్రదర్శనలు అబ్బురపరిచాయి. కార్యక్రమంలో మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కె.ఎస్.వి.రాజశేఖర్, ఇండస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ గాయిని రాజశేఖర్, విద్యాసంస్థల మేనేజర్ పి.విల్సన్ అగస్టీన్, ప్రధానాచార్యులు మీనాక్షి విల్సన్ అగస్టీన్, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరెడ్డి, యోగా మాస్టర్ బి.శ్రీనివాసులు,టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పాల్గొన్నారు. శ్రీ పతంజలి సాయినాథ్ యోగ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలో, సూర్యనారాయణ స్వామి ఆలయంలో కూడా వేడుకలు ఘనంగా జరిగాయి.





సూర్య దేవాలయంలో స్వామికి పూజలు నిర్వహిస్తున్న శ్రీ దత్త విజయానంద స్వామీజీ, దర్శించుకుంటున్న భక్తులు



సూర్యుని విగ్రహానికి అభిషేకం చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

బఫూన్లు భగత్‌సింగ్‌లు కాలేరు

- జగన్ పాదయాత్ర ఒక చరిత్ర.. లోకేష్‌ది నాటక యాత్ర
- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్



కర్నూలు(రాజ్‌విహార్): సినిమా డైలాగులు చెప్పినంత మాత్రాన లోకేష్.. బఫూన్లు భగత్‌సింగ్‌లు కాలేరని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం స్థానిక సీ.క్యాంప్‌లో ఉన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్ర ఓ చరిత్ర అని, మాజీ సీఎం చంద్రబాబు కుమారుడు చేస్తున్న యాత్ర నాటకమని ఎద్దేవా చేశారు. పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు సీఎం జగన్ యాత్ర చేస్తే ముఖ్యమంత్రి అయ్యారు.. తాను చేస్తే అధికారంలోకి వస్తానను కోవడం భ్రమ అన్నారు. ప్రజల బలం మెండుగా ఉన్న తమ పార్టీ అధినేతను ఎదుర్కోవడం ఎవరితరం కాదని, 2024లో 175 స్థానాల్లో గెలుపు సాధిస్తాని ధీమా వ్యక్తం చేశారు. దివంగత నేత వైఎస్ఆర్ మరణం తరువాత ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనకడుగు వేయకుండా 3648 కిలో మీటర్ల పాదయాత్ర చేసి చరిత్ర సృష్టించడం జగన్‌కే సొంతమన్నారు. లోకేష్ బాడీ లాంగ్వేజ్‌కి, డైలాగులకు పొంతన లేదని, ఆయన తల్లిదండ్రుల చాటు బిడ్డే తప్ప నాయకుడు కాలేదన్నారు. అతనిపై నమ్మకం లేకే మంగళగిరిలో ఘోరంగా ఓడించారని, ఎన్ని జిమ్మిక్కులు చేసిన టీడీపీని, చంద్రబాబును ప్రజలు నమ్మరని పేర్కొన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన పెంచాలి



పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన పెంచాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని రికార్డులు, హాజరుపట్టిక పరిశీలించారు. ప్రతి ఉద్యోగి విధిగా ఫేషియల్ గుర్తింపు యాప్‌లో హాజరు వేయాలని ఆదేశించారు. ఆసుపత్రిని శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. రోగులకు, బాలింతలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షయ, కుష్ఠు, అసంక్రమిత వ్యాధులను గుర్తించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రక్తహీనత నివారణ చర్యలు, పోషకాహారం, వ్యాధినిరోధక టీకాలపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. వయస్సుతో పాటు ఎత్తు, బరువు పెరగని పిల్లల రికార్డులు పరిశీలించిన ఆయన ఇలాంటి వారికి పోషకాహారంతో పాటు ఆరోగ్య సూచనలు చేయాలని చెప్పారు. తీవ్రమైన పోషకాహారలోపం ఉన్న పిల్లలను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎన్ఆర్‌సీలో చేర్పించాలన్నారు.

ఆల్ ఇండియా పోటీల్లో 'ఆర్‌యూ' ప్రతిభ



మూడవ స్థానం సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న వైస్ చాన్స్‌లర్ ఆనందరావు

కర్నూలు (టౌన్): ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు జలంధర్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బ్యాడ్మింటన్ పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీ జట్టు ప్రతిభ చాటి మూడవ స్థానం సాధించింది. దీంతో ఆర్‌యూ జట్టు క్రీడాకారులను యూనివర్సిటీ ప్రాంగణంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనందరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత స్థాయి నుంచి అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయిలో ఆర్‌యూ క్రీడాకారులు పతకాలే లక్ష్యంగా ఆటను ప్రదర్శించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఆల్ ఇండియా స్థాయిలో రాణించి ఖేలో ఇండియా పోటీలకు అర్హత సాధించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం లేఅవుట్ ఉండాలి



పసుపుల వద్ద లేఅవుట్‌లో కొలతలను పరిశీలిస్తున్న కుడా వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ (కుడా) పరిధిలో వెలిసే లేఅవుట్లలో ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కుడా వైస్ చైర్మన్ భార్గవ్ తేజ అన్నారు. శనివారం కర్నూలు మండలం పరిధిలోని పసుపుల, బి.తాండ్రపాడు, గుట్ట పాడు, నన్నూరు, ఉల్చాల, ఆటో నగర్ వంటి ప్రాంతాల్లో కుడా పరిధిలోని లేఅవుట్లను కుడా ప్లానింగ్, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. అనుమతి పొందిన లేఅవుట్లు, అనుమతి కొసం దరఖాస్తు చేసు కున్న లేఅవుట్లను వైస్ చైర్మన్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టానుసారంగా లేఅవుట్లు వేయడం వల్ల భవిష్యత్తులో కొనుగోలు దారులు అనేక ఇబ్బందులు పడతాయన్నారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుడా జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ రాజేష్, డీఈఈ నాసీర్, ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు మంచి స్పందన

కర్నూలు (టౌన్): ఏపీ సీఎం కప్ పోటీలకు క్రీడాకారుల నుంచి మంచి స్పందన వస్తోందని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ, చీఫ్ కోచ్ నటరాజరావు అన్నారు. వచ్చే నెలలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు సంబంధించి స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శనివారం ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, హ్యాండ్‌బాల్, వాలీబాల్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు మంచి ప్రోత్సాహం అందిస్తుందన్నారు. అనంతరం విజేతల పేర్లను ప్రకటించారు. ఖోఖో పురుషుల విభాగంలో తుగ్గలి (మొదటిస్థానం), నందికొట్కూరు (ద్వితీయ స్థానం), ఖోఖో మహిళల విభాగంలో తుగ్గలి (మొదటిస్థానం), వాలీబాల్ పురుషుల విభాగంలో కోడుమూరు (మొదటిస్థానం), కర్నూలు (ద్వితీయ స్థానం), పత్తికొండ (మూడవ స్థానం), ఫుట్‌బాల్ పురుషుల విభాగంలో నంద్యాల (మొదటిస్థానం), కర్నూలు (రెండవ స్థానం), నంద్యాల(మూడవ స్థానం), ఫుట్‌బాల్ మహిళలు నంద్యాల(మొదటిస్థానం), కర్నూలు (రెండవ స్థానం) సాధించినట్లు వెల్లడించారు.

రసాయనాలు లేని ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

కర్నూలు కల్చరల్: రసాయనాలు లేని ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని కర్నూలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కళావతి అన్నారు. కళాశాల తృతీయ సంవత్సర జీవశాస్త్రం (లైఫ్ సైన్సెస్) విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా శుద్ధ గ్రీన్ ప్రైవేట్ లిమిటెడ్ వారి సౌజన్యంతో కళాశాలలో హైడ్రోఫోనిక్స్ యూనిట్లను ఏర్పాటు చేశారు. ఆ యూనిట్ల ద్వారా తొలిదశ ఉత్పత్తులుగా ఆకుకూరలను శనివారం కోశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ హైడ్రోఫోనిక్స్ ద్వారా ఎటువంటి రసాయనాలు లేకుండా పంటలను ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. లాంగ్ టర్మ్ ఇంటర్న్‌షిప్‌కి హైడ్రోఫోనిక్స్ ద్వారా స్వయం ఉపాధికి దారులు వేసుకున్న విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ.సత్యనారాయణ, వృక్షశాస్త్ర విభాగాధిపతి కె.వి.మధుసూదన్, అధ్యాపకులు జె.హేమంత్, బాషా మొహిద్దీన్, షాజిదాబి, మధుసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో పతకాలు సాధించాలి

కర్నూలు (టౌన్): ఈ నెల 29, 30 తేదీలలో గుంటూరు జిల్లా చీరాలలో నిర్వహించనున్న అండర్-17 బాల బాలికల రాష్ట్ర స్థాయి శాప్ లీగ్ షూటింగ్ బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఈశ్వర్ నాయు డు అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారి టీ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే క్రీడాకా రులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ రాముడు శనివారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు.